క్లుప్తంగా

శింగరకొండ దర్శిని



అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం వైశాఖ మాసం కృత్తిక నక్షత్రం అమావాస్య తిథి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు సోమవారం తెలిపారు. క్షేత్ర ప్రాధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం , మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీ సువర్చలా సహిత దక్షిణాభిముఖప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

లోక రక్షణకు ఏసు జననం



ప్రార్థన సమావేశానికి హాజరైన క్రైస్తవులు

కారంచేడు: సర్వలోక మానవుల పాపాలను తొలగించడానికి, పాపులను రక్షించడానికే యెహోవా కుమారుడైన ఏసుక్రీస్తు ఈ లోకంగా శరీరధారిగా జన్మిచారని హైదరాబాద్‌కు చెందిన షీలోహు ప్రార్థనా మందిర వ్యవస్థాపకుడు.. బిషప్, డాక్టర్ ఎం. సుదర్శనరావు అన్నారు. సోమవారం కారంచేడు పాత కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన బహిరంగ ప్రార్థనా సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఈ నెల 25 తేదీ నుంచి 27వ తేదీ వరకు మండల కేంద్రమైన కారంచేడు గ్రామంలో నిర్వహించనున్న క్రాస్, క్రౌన్ మినిస్ట్రీస్ వారి విడుదల, స్వస్థత, అభిషేక, ఆరాధన పండుగల సమావేశంలో మాట్లాడారు. కారంచేడు మండల పాస్టర్స్ అసోసియేషన్ కార్యదర్శి, పాస్టర్ నూనె యేసేపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సిస్టర్ రిబ్కాసుదర్శన్, సిస్టర్ బ్లెస్సీ జాన్సన్‌లు కూడా మహిళలకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. నంతరం ప్రేమ విందును ఏర్పాటు చేశారు.

విద్యతోనే భవిష్యత్తుకు బంగారు బాట



పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

చీమకుర్తి: విద్యతోనే విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోగలరని ఆర్‌డబ్ల్యూడీ ప్రాజెక్ట్ పీడీ విద్యాసాగర్ అన్నారు. విద్యార్థి దశ నుంచే ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు ప్రణాళికలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. పద్మశాలీయుల సేవాసంఘం ఆధ్వర్యంలో సోమవారం చీమకుర్తిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పదో తరగతిలో 500కుపైగా మార్కులు, ఇంటర్‌లో 900కుపైగా మార్కులు సాధించిన పద్మశాలీయ విద్యార్థుల ప్రతిభా నైపుణ్యాలను అభినందిస్తూ పురస్కారాలు, జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా పద్మశాలీయుల ఆరాధ్యదైవం యర్రాప్రగడ కోటయ్య విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు గోపీకృష్ణ, కే వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, కౌన్సిలర్లు సోమా శేషాద్రి, గోపురపు చంద్ర, దొంతు వెంకట్రావు, దోమల పుల్లయ్య పాల్గొన్నారు.

కానరాని అభయం

- వర్షాకాలంలో పొంచిఉన్న వాయు'గండాలు'
- చీరాల మండలంలో తుఫాన్ షల్టర్లు కరువు
- 9 కేంద్రాలకు గాను వినియోగంలో ఒక్కటే
- మిగిలినవి శిథిలావస్థకు చేరుకోవడంతో కూల్చిన అధికారులు
- ప్రస్తుతం పునరావాస కేంద్రాలుగా కళాశాలలు, హైస్కూళ్లు



వినియోగానికి అనువుగా ఉన్న వాడరేవులోని ఏకైక తుఫాన్ షల్టర్

చీరాల టౌన్: సముద్ర తీర ప్రాంతాల్లో ప్రజలు నిత్యం బిక్కుబిక్కుమంటూ గడపాల్సిందే. తుఫాన్ పేరు వింటేనే వణికిపోవడం పరిపాటిగా మారింది. దీనికితోడు ప్రభుత్వ నిర్లక్ష్యం వారి ఆందోళనను మరింత ఎక్కువగా చేస్తోంది. ప్రతి ఏటా చీరాల మండల తీరంలో సుమారు పది వరకు తుఫాన్లు, వాయుగుండాలు ఏర్పడుతుంటాయి. ఈ సమయంలో భారీ వర్షాలు, తుఫాన్లు, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు లోతట్టు, బాధిత ప్రాంతాల్లో నివసించే ప్రజలను సురక్షితంగా పునరావాస కేంద్రాల్లో ఉంచేందుకు ఏర్పాటు చేసిన తుఫాన్ షెల్టర్లు ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్నాయి. మండలానికి ఒకే తుఫాన్ షల్టర్ వినియోగంలో ఉందంటే అధికారుల పనితీరును ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలోనే పేరుగాంచిన సముద్ర తీర పర్యాటక ప్రాంతం చీరాల వాడరేవు, రామాపురం తీర ప్రాంత గ్రామాలు. ఈ గ్రామాల్లో మత్స్యకారులు పదివేలకు పైగా జీవనం సాగిస్తుంటారు. ఈ క్రమంలో తీరప్రాంత గ్రామాలతో పాటు లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేర్చి వారికి ఆశ్రయం అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన తుఫాన్ షెల్టర్లు నేడు కనుమరుగయ్యాయి.

ముందుగానే విస్తరిస్తున్న రుతుపవనాలు

తుఫాన్‌లు, గాలివానలు, వరదలు సంభవించినప్పుడు బాధిత ప్రాంతాల ప్రజలను సురక్షితంగా ఉంచేందుకు మండలంలో తొమ్మిది తుఫాను షెల్టర్లను గతంలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే గత కొంత కాలంగా ఈ తుఫాన్ షెల్టర్లను వినియోగించకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో పలు తుఫాన్ షల్టర్లును కూల్చివేశారు. గతంలో వరుసగా సంభవించిన లైలా, ఓగ్ని, జల్, థానే వంటి తుఫాన్ల సమయంలో కూడా ఈ షల్టర్లు శిథిలావస్థలో ఉండటంతో రెవెన్యూ, పంచాయతీ శాఖ అధికారులు వీటిని వినియోగించకుండా ప్రత్యామ్నాయ మార్గాలైన వివిధ కళాశాలలు, పాఠశాలల్లో పునరావాసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో రుతుపవనాలు వేగంగా విస్తరిస్తూ వర్షాలు పడే సూచనలున్నాయని వాతావరణశాఖ అధికారులు హెచ్చరికలు చేస్తున్నారు. రూరల్ గ్రామాలైన దేవినూతల, పచ్చమొగిలి, విజయలక్ష్మీపురం, దేవాంగపురి, పిట్టువారిపాలెం, కీర్తివారిపాలెం గ్రామ పంచాయతీల్లో ఉన్న తుఫాన్ షల్టర్లను అధికారులు కూల్చివేశారు. తోటవారిపాలెం, కావూరివారిపాలెంలో ఉన్న తుఫాన్ షల్టర్లలో కాకుండా తాత్కాలికంగా రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాలను వినియోగిస్తున్నారు. కేవలం వాడరేవు గ్రామంలో ప్రపంచ బ్యాంకు నిధులు రూ.1.5 కోట్లతో నిర్మించిన తుఫాన్ షెల్టర్ మాత్రమే వినియోగంలో ఉంది. ఆపదలో ఉన్న వారిని ఆదుకుని ఆశ్రమం కల్పించేందుకు లక్ష్యం ఇలా అట



హనిమిరెడ్డిని సత్కరిస్తున్న పులిగం కోటిరెడ్డి, కోయి అంకారావు

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

అద్దంకి రూరల్: పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. ఇటీవల రాష్ట్ర వైఎస్సార్ సీపీ బూత్ కమిటీ జాయింట్ సెక్రటరీగా నియమితులైన పులికం కోటిరెడ్డి, రాష్ట్ర వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ జాయింట్ సెక్రటరీగా నియమితులైన కోయి అంకారావు సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పానెం చిన హనిమిరెడ్డిని దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా హనిమిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇద్దరికి పార్టీ రాష్ట్ర కార్యవర్గంలో చోటుదక్కటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, మండల కన్వీనర్లు, సర్పంచ్‌లు, కౌన్సిలర్‌లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన అద్దంకిలోని వైఎస్సార్ సీపీ కార్యకర్త, మాజీ వలంటీర్ షేక్ సైదాను కుటుంబాన్ని హనిమిరెడ్డి పరామర్శించారు.

జగనన్న మిషన్ లోగో ఆవిష్కరణకు ఆహ్వానం

అద్దంకి: ఈ నెల 31న జగనన్న మిషన్ లోగో ఆవిష్కరణ కార్యక్రమాన్ని కడపలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని అద్దంకి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డికి ఆహ్వానం అందినట్లు హనిమిరెడ్డి సోమవారం తెలిపారు.

దివ్యాంగుల గుర్తింపు కోసం ఇంటింటి సర్వే



కుంకలమర్రులో ఇంటింటి సర్వే ద్వారా సమాచారం సేకరిస్తున్న సహిత ఉపాధ్యాయులు



ఇంకొల్లు: అంగన్ వాడీ కేంద్రంలో సర్వే చేస్తున్న రిసోర్స్ పర్సన్

కారంచేడు: మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో చిన్నారి దివ్యాంగులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే పటిష్టంగా నిర్వహించాలని ఎంఈఓ ఎంవీ సత్యన్నారాయణ తెలిపారు. సోమవారం కుంకలమర్రు, సర్ల గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష పథక రాష్ట్ర సంచాలకులు, బాపట్ల జిల్లా అడిషినల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్‌ల సంయుక్త ఆదేశాల మేరకు 0 నుంచి 18 సంవత్సరాల వయస్సు కలిగిన బాల, బాలికల సర్వే చేయాలన్నారు. దివ్యాంగులకు పలు రకాల అలవెన్సులు, అవసరమైన ఉపకరణాలను ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు నూతనంగా మండలంలో 11 మందిని గుర్తించామని సహిత విద్యా ఉపాధ్యాయులు జి. వసంత బాబు, వి. విజయకుమార్ పేర్కొన్నారు. ఎంఈఓ-2 మొలబంటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు గుర్తింపు

ఇంకొల్లు(చినగంజాం): మండలంలోని ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల సర్వే నిర్వహిస్తున్నట్లు ఐఈ రిసోర్స్ పర్సన్ వి. వీరయ్య తెలిపారు. మండల విద్యాశాఖాధికారి ఏ. శ్రీనివాసరావు పర్యవేక్షణలో మండలంలోని ప్రతి గ్రామంలో సర్వే చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన 0 నుంచి 18 ఏళ్ల వరకు వివిధ రకాల మానసిక, శారీరక దివ్యాంగులైన పిల్లలను గుర్తిస్తామన్నారు. సర్వేకు సంబంధించి అంగన్ వాడీ కేంద్రాలను, సచివాలయాలను, హెల్త్ అసిస్టెంట్‌లను కలిసి పిల్లలను గుర్తించి నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి దివ్యాంగులకు అవసరమైన పరికరాలు సమగ్ర శిక్ష ద్వారా అందిస్తామని వివరించారు. దివ్యాంగుల వివరాలను స్థానికులు 9014961616 నంబరుకు తెలియజేయాలని కోరారు.

దేశంలో ఉగ్రవాదం, మతోన్మాదం

- చీరాల రూరల్ సీఐ శేషగిరిరావు



మాట్లాడుతున్న రూరల్ సీఐ శేషగిరిరావు

వేటపాలెం: దేశానికి ఉగ్రవాదం, మతోన్మాదం పెద్ద సమస్య మారిందని, వీటిని నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని చీరాల రూరల్ సీఐ పి. శేషగిరిరావు పేర్కొన్నారు. చీరాల ఇంజినీరింగ్ కళాశాల్లో జరుగుతున్న ఎన్‌సీసీ క్యాంపులో భాగంగా యాంటీ టెర్రరిజంపై ఎన్‌సీసీ క్యాండెట్‌లకు సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రూరల్ సీఐ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఉగ్రవాదులు దేశాన్ని ఆర్థికంగా, సామాజికంగా దెబ్బతీయాలని చూస్తున్నారన్నారు. ఉగ్రవాద దేశాల్లో నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల వారికి డబ్బులు ఎర చూపి వారిని ఉగ్రవాదులుగా మారుస్తున్నారని తెలిపారు. ఎన్‌సీసీ క్యాండెట్‌లకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. తాను చదువుకున్న రోజుల్లో తానూ ఎన్‌సీసీ క్యాడెట్‌గా ఉన్నాని గుర్తు చేసుకున్నారు. కొం మంది విద్యార్థులు వివిధ రకాల వ్యసనాలకు బానిసలై వారి జీవితాలను నాశనం చేసుకుటున్నారని తెలిపారు. ట్రాఫిక్ రూల్స్‌ని తప్పని సరిగా పాటించాలని సూచించారు. సుబేదార్ మేజర్ నజీర్ అమ్మద్, సుబేదర్ ముఖేశ్ అవతార సింగ్, బీహెచ్‌ఎం రమేష్, ఎస్సై ఏ. చంద్రశేఖర్, ఎస్‌బీ ఎస్సై కాటూరి శ్రీనివాస్, పి. సురేష్, టి. వెంకటేశ్వర్లు, సీహెచ్ సుబ్బారావు, పావని, ఎస్‌కే ఫాతిమా, హావల్దార్ దీపక్ పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

బల్లికురవ: ఖరీఫ్ ఆరంభ పంటలుగా పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీపై అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామని వ్యవసాయాధికారి ఎస్‌వీపీ కుమారి సోమవారం తెలిపారు. అవసరమైన విత్తనాలను లైసెన్స్ పొందిన డీలర్ నుంచి కొనుగోలు చేస్తూ విధిగా బిల్లు పొందాలన్నారు. అనుమతులు లేకుండా గ్రామాల్లో విత్తనాలు విక్రయిస్తే శాఖపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమస్యలు పరిష్కరించండి

చీరాల టౌన్: పంచాయతీల కార్యదర్శులు విధులను సమర్థవంతంగా నిర్వహించి గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయాలని ఎంపీడీఓ పి.శివ సుబ్రమణ్యం సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల సెక్రటరీలు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామ సచివాలయాలను తనిఖీలు చేసి పెండింగ్ అర్జీలను విచారించినట్లు తెలిపారు. ప్రజలు వచ్చిన అర్జీలను నిశితంగా విచారించి అర్హులైన ప్రతి ఒక్కరి సమస్యకు పరిష్కారం అందించాలన్నారు. ప్రభుత్వ సేవలను సత్వరంగా అందించేందుకు సచివాలయాల సిబ్బంది అంకితభావంతో పని చేయాలని సూచించారు. సచివాలయాల ద్వారా అందించే సేవలను నిర్ణీత సమయంలోగా అర్జీదారులకు అందించాలన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా విధులు నిర్వహించాలని కోరారు. ప్రజలకు అందించే సేవల్లో అలసత్వం వహించిన వారిపై చర్యలు తప్పవన్నారు. ఈవోఆర్డీ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లున్నారు.

యోగాతో శారీరక, మానసిక రుగ్మతలు దూరం



యోగా గురించి వివరిస్తున్న హోమియో వైద్యులు చంద్రశేఖర్

పర్చూరు(చినగంజాం): యోగాతో మానసిక, శారీరక రుగ్మతలు దూరం చేసుకోవచ్చు అని ప్రభుత్వ హోమియో వైద్యాధికారి డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని ఉప్పుటూరు పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సిబ్బందితో యోగా చేయించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జూన్ 21 ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఆయన ఆంధ్రప్రదేశ్ వస్తున్నారని, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పట్టణ, గ్రామ స్థాయిలో యోగా సాధన కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందని యోగా ప్రాముఖ్యత గమనించాలని తెలియజేశారు. ప్రతి రోజూ 45 నిమిషాలు పాటు యోగా చేయడం ద్వారా అనేక రకాల శారీరక, మానసిక రుగ్మతలు దూరం అవుతాయని వివరించారు.


పీజీఆర్‌ఎస్‌తో సమస్యల పరిష్కారం

చీరాల టౌన్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉపయోగించుకోవాలని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ అన్నారు. పీజీఆర్‌ఎస్ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. పలు శాఖల అధికారులతో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలను తహసీల్దార్‌కు అందించారు. ఈసందర్భంగా గోపీకృష్ణ మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు ఉన్న రెవెన్యూ, ఇతర ప్రభుత్వ శాఖల సమస్యలను అర్జీల ద్వారా అందిస్తే సత్వరమే వాటికి పరిష్కారం చూపుతామన్నారు. స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల వారీగా ఏర్పాటు చేసిన సచివాలయాలు, మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం అర్జీల స్వీకరణ జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందించగా ప్రాధాన్యతాక్రమంలో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. స్పందన కార్యక్రమంలో వివిధ రకాల సమస్యలపై ప్రజలు 15 అర్జీలను అందించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి

ఇంకొల్లు(చినగంజాం): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సత్వరం చర్యలు చేపట్టాలని తహసీల్దార్ వెంకటరత్నం తెలియజేశారు. గ్రీవెన్స్ విజ్ఞప్తుల దినోత్సవం పురస్కరించుకొని మండల స్థాయి అధికారులతో ఆయన మాట్లాడారు. వర్షాలు కురుస్తున్న సమయంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, కార్యదర్శులు ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుద్ధ్య పనులు చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మురుగు కాలువల్లో నీరు నిలువ ఉండకుండా చూడటం, బ్లీచింగ్, ఫినాయిలు చల్లించడం, కాలువలలో ఆయిల్ బాల్స్ వేయడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. కొబ్బరి బోండాల వ్యర్థాలను గ్రామానికి దూరంగా డంపింగ్ యార్డుకు తరలించాలని, నివాస గృహాల్లో.. నీటి తొట్టెల్లో.. పనికిరాని టైర్లలో నీరు ఎక్కువ కాలం నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఫాగింగ్ చేయాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి జ్యోతి, ఏపీఎం అనురాధ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముప్పవరం వాసికి విశ్వకర్మ లెజెండ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న సిద్దు వెంకటసుబ్బారావు

జె.పంగులూరు: విశ్వకర్మ లెజెండ్ అవార్డును పంగులూరు మండలంలోని ముప్పవరం గ్రామానికి చెందిన సిద్ది వెంకటసుబ్బారావును వరించింది. హైదరాబాద్ బాగ్ లింగపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ 9 వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వ్యవస్థాపక చైర్మన్ విశ్వనాదుల పుష్పగిరి ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న వివిధ రంగాల్లో ప్రతిభ కనపరిచిన వారిని ఆహ్వానించారు. ఇందులో భాగంగా విశ్వకర్మ లీడర్, విశ్వకర్మ యంగ్ లీడర్, విశ్వకర్మ లెజెండర్ అవార్డులను ప్రదానం చేశారు. సేవా, సామాజిక రంగం, వృత్తి పరంగా పలు రకాల సేవలు చేస్తున్న సిద్దు వెంకట సుబ్బారావు గుర్తించి ఆ అవార్డు అందజేశారు. తెలంగాణ క్రైమ్ బ్రాంచ్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె. కిరణ్‌కుమార్ అవార్డు అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు అకారం శ్రీనివాసచారి, ప్రధాన కార్యదర్శి సోల్లేటి ప్రభాకర్ ఆచారి, కొండపి గణేష్‌బాబు, విశ్వకర్మ సేవా ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి తక్కెళ్ళపాటి నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విధుల నుంచి తొలగించడం అన్యాయం



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మీరాబి

జె.పంగులూరు: తాను గత 13 సంవత్సరాల నుంచి పంగులూరు గ్రామంలో, పంగులూరు -2 డ్వాక్రా మహిళా సమైక్య సంఘాలకు యానిమేటర్‌గా పని చేస్తున్నాని, అయితే తనను అన్యాయంగా తొలగించారని.. న్యాయం చేయాలంటూ షేక్ మీరాంబి తహసీల్దార్ పి. సింగారావుకు సోమవారం వినతి పత్రం అందజేసింది. ఈ 13 ఏళ్లలో ఎలాంటి అక్రమాలకు తాను పాల్పడలేదని, డ్వాక్రా సంఘాలు మద్దతు కూడా తనకు ఉందని వినతిపత్రంలో తెలిపింది. తనను అన్యాయంగా తొలగించడం వలన సంఘాలలో ఉన్న 32 మహిళా డ్వాక్రా గ్రూపులు గత ఆరు నెలల నుంచి ఎలాంటి రుణాలు రావడం లేదని, డ్వాక్రా మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపింది. ఈ సదర్భంగా సీపీఎం నాయకుడు రాయిణి వినోద్‌బాబు, తలపనేని రామారావు మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలను రాజకీయం చేయకూడదన్నారు. ఆధికారంలో ఉంటే కూటమి నాయకులు ఏదైన చెయవచ్చనే ఆహంకారంతో వీవోఏలను తొలగించారని, ఇది చట్ట రీత్యా నేరమన్నారు. మీరాంబిని తక్షణమే విధులోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తిరుమలపురపు వెంకాయమ్మ, తాతపూడి సత్యవతి, రావూరి శివమ్మ, పాలపర్తి వెంకాయమ్మ, మంద మేరి, తాళ్తూరి వజ్రం, ప్రజా కళాకారుడు జాన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం ఎలా?



బాలాజీ నగర్ ప్రధాన రోడ్డులో నిలిచిన మురుగు నీరు



బాలాజీ నగర్‌లో సిమెంట్ రోడ్డు..

- దుర్గంధంగా మారిన రోడ్లు

వేటపాలెం: వేటపాలెం రోడ్లు డ్రైనేజీలను తలపిస్తున్నాయి. డ్రైనేజీలో ప్రవహించాల్సిన నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. మురుగు నీటి కాలవలు పూడి పోవడంతో ఆ మురుగు నీరు రోడ్ల మీద ప్రవహిస్తోంది. రైల్వే స్టేషన్ రోడ్డులో మురుగు కాలవల్లోని నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో ఈ ప్రధాన మార్గం నుంచి వెళ్లే ప్రజలు ఆ నీటిలోనే నడవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. ఈ మార్గం ద్వారా రైల్వే స్టేషన్, పోలీస్ స్టేషన్, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, బీబీహెచ్ జూనియర్ కళాలకు ప్రతి రోజూ అధిక సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తోందని స్థానికులు ఎన్ని పర్యాయాలు పంచాయతీ అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని వాపోతున్నారు.

బాలాజీనగర్‌లో..

బాలాజీనగర్‌లో అంతర్గత రోడ్లపై మురునీరు నిలబడి రాకపోకల కష్టంగా మారింది. ఈ కాలనీలో ప్రధాన రహదారిలో సంవత్సరం అంతా రోడ్డు పైనే మురునీరు నిలబడి ఉంటుంది. దీంతో ఈ నీటిలో నుంచి దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమలకు ఆవాసంగా మారిందని స్థానికులు తెలిపారు. స్థానికంగా ఉండే ఒక ప్రభుత్వ అధికారి తన ఇంటిలో నుంచి మురుగు నీటిని రోడ్డు పైకి నిత్యం వదులుతుండంతో పరిస్థితి దారుణంగా ఉందని స్థానికులు తెలిపారు. ఈ విషయం అనేక పర్యాయాలు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకొన్న దాఖలాలు లేవని బాలాజీ నగర్ కాలనీ వాసులు వాపోతున్నారు.

ప్రత్యేకాధికారిగా వినయ్‌కుమార్

అద్దంకి: బాపట్ల జిల్లా కలెక్టర్ జిల్లాలోని మండలాలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేసినట్లు ఎంపీడీఓ శింగయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ఉత్తర్వుల మేరకు అద్దంకి పట్టణ, మండల ప్రత్యేకాధికారిగా డీఎఫ్‌వో వినయ్‌కుమార్‌ను నియమించినట్లు తెలిపారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచండి



మాట్లాడుతున్న వెల్ఫేర్ అసిస్టెంట్

బల్లికురవ: తుఫాన్ ప్రభావంతో అకాల వర్షాలు కురుస్తున్నందున గ్రామాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, బల్లికురవ, కొమ్మినేనివారిపాలెం సెక్రటరీలు చంద్రశేఖర్, గాయత్రి కోరారు. సోమవారం ఆయా గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛదివాస్‌పై సమావేశాలు నిర్వహించారు. గ్రామాలు పరిశుభ్రంగా లేకపోతే సీజనల్ జ్వరాలు, వ్యాధులు సోకే ప్రమాదం ఉందని పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు పడవేయవద్దని రోడ్ల వెంట ఎరువు దిబ్బలు వేయవద్దని ప్రజలకు సూచించారు.